సాక్షి
మహబూబాబాద్

గురువారం | 26 | జనవరి | 2023



పచ్చని సిరి.. పర్వతగిరి

ఓవైపు ఆధ్యాత్మికం.. మరోవైపు ఆహ్లాదం. ఇంకోవైపు పర్యాటకం. ఇలా పచ్చని సిరిగల పర్వతగిరి భక్తులను, ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది. - 8లో▸



ఘనంగా శుద్ధి పండుగ

మేడారంలో సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ గుడి శుద్ధి పండుగ పూజా కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.6°/13.9°

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మంచుతో పాటు చలి తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

108లో ప్రసవం



దోర్నకల్: డోర్నకల్‌కు చెందిన ఓ గర్భిణి మంగళవారం అర్ధరాత్రి 108 వాహనంలో ప్రసవించింది. డోర్నకల్‌కు చెందిన ఎస్‌కే.రేష్మాకు రాత్రి పురిటినొప్పులు రాగా కుటుంబసభ్యులు 108కు సమాచారం అందించారు. రేష్మాను 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో వాహనంలోనే పండంటి పాపకు జన్మనిచ్చింది. ఈఎంటీ వీరన్న తల్లీబిడ్డలకు పరీక్షలు నిర్వహించిన అనంతరం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని ఈఎంటీ తెలిపారు.

అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యం

కురవి: అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యమని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు కందికొండ గ్రామంలోని కంటి వెలుగు శిబిరాలను ఆయన పరిశీలించారు. క్యాంపులకు ఎంత మంది వస్తున్నారని, ఇప్పటి వరకు ఎంత మందికి పరీక్షలు చేశారని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్మానీయేల్, వైద్యులు విరాజిత, వేణుమాధవ్, మౌనిక, ఆశకార్యకర్తలు కాశేశ్వరీ, నిర్మల, విజయ, అరుణ, వినోద, మరియ ఏఎన్‌ఎం కుమారి, సునీత, వార్డు సభ్యుడు నూతక్కి నర్సింహరావు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు



బయ్యారం: పంటల్లో తెగుళ్ల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ మాలతి సూచించారు. బుధవారం మండలంలోని బయ్యారం, గంధంపల్లి–కొత్తపేట, సింగారం గ్రామాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలిసి వరి, మిరప, మొక్కజొన్న, బొబ్బెర ఇతర పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రాంజీ, శాస్త్రవేత్తలు రాంబాబు, క్రాంతికుమార్, కిషోర్‌కుమార్, ఏఈఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన

మహబూబాబాద్: నూతన కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, స్క్రీనింగ్ కమిటీ ఆధ్వర్యంలో దివ్యాంగుల, వయోవృద్ధులకు సంబంధించిన ఉపకరణాల దరఖాస్తులను పరిశీలించినట్లు ఇన్‌చార్జ్ జిల్లా సంక్షేమ అధికారి నర్మద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువపత్రాలను పరిశీలించి బ్యాటరీ వీల్‌చైర్స్‌కు 13మంది, ఫోర్‌జీ స్మార్ట్ ఫోన్లకు ముగ్గురిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు.

ఎస్‌ఏల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

మహబూబాబాద్ అర్బన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా రెండోరోజు బుధవారం స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ)ల సర్టిఫికెట్లను పరిశీలించారు. కాగా జిల్లాలో ఖాళీగా ఉన్న 38 ప్రధానోపాధ్యాయ పోస్టులను మల్టీజోన్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. దీనిలో భాగంగా 2005వరకు నియామకమైన 140మంది స్కూల్ అసిస్టెంట్లు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారులు తుది జాబితాను ఆర్‌జేడీ కార్యాలయానికి పంపించారు.

మార్కెట్‌కు సెలవులు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఈ నెల 27, 28, 29తేదీల్లో సెలవులు ప్రకటించామని ఏఎంసీ సెక్రటరీ రాజేందర్ బుధవారం తెలిపారు. గురువారం యథావిధిగా గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ ఉంటుందన్నారు. వ్యవసాయ మార్కెట్‌లో శాఖపరమైన పనుల వల్ల మూడు రోజులు సెలవులు ప్రకటించామని తెలిపారు. మళ్లీ ఈ నెల 30వ తేదీ నుంచి మార్కెట్‌లో యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని రైతులు, వ్యాపారులు, హమాలీలు గమనించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని 81జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 19 ప్రాథమికోన్నత పాఠశాలలు, 15 కేజీబీవీల్లో నెల రోజుల పాటు విద్యార్థినులకు కరాటేలో శిక్షణ ఇవ్వడానికి అర్హులైన మాస్టర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ మాస్టర్లకు నెలకు రూ. 5వేల గౌరవ వేతనం ఉంటుందన్నారు. కాగా ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట వరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

నూతన సభ్యత్వాలు!

జిల్లాలో మత్స్య సొసైటీల పెంపునకు కసరత్తు

- చెరువుల విస్తీర్ణం, నీటి లభ్యత ఆధారంగా ఏర్పాటు
- 2,500 నుంచి 3వేల వరకు సభ్యత్వాల నమోదుకు సన్నాహాలు
- చేపల ఉత్పత్తి పెరగడంతో మత్స్యకారుల మధ్య పంచాయితీలు



సాక్షి, మహబూబాబాద్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత చెరువుల అభివృద్ధి, మత్స్యకారులకు ప్రోత్సాహకాలు, రుణాల పంపిణీతో పాటు ఉచితంగా చేపపిల్లలను ప్రభుత్వం సరఫరా చేస్తోంది. దీంతో మత్స్యకారుల ఆదాయం పెరిగింది. దీనిని దృష్టిలో ఉంచుకొని చెరువుల విస్తీర్ణం ఆధారంగా మత్స్య సొసైటీలను పెంచాలని రాష్ట్ర మత్స్య శాఖ అధికారులు ఆదేశించడంతో నూతన సభ్యత్వాలు ఇచ్చేందుకు జిల్లా మత్స్యశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. అయితే చెరువులు నిండుగా ఉండటం.. మత్స్య సంపద పెరగడంతో మత్స్యకారుల మధ్య పంచాయితీలు కూడా మొదలయ్యాయి.

విస్తీర్ణం ఆధారంగా..

చెరువు విస్తీర్ణం ఆధారంగా సభ్యుల సంఖ్య ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా నీటిపారుదలశాఖ పర్యవేక్షణలో 737చెరువులతో పాటు 527కుంటలు, చెక్ డ్యామ్‌లు మొత్తంగా 1,264 నీటి వనరులు ఉన్నాయి. ఇందులో నిరంతరం నీటి లభ్యత ఉన్న చెరువులు 278, వర్షాధార నీటి లభ్యత గల చెరువులు, కుంటలు 986 ఉన్నాయి. వీటిపై 169 సంఘాల్లో 1,1500 మంది మత్స్యకారులు ఆధారపడి జీవిస్తున్నారు. కాగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిరంతర నీటి లభ్యత ఉన్న చెరువుల విస్తీర్ణం ఆధారంగా ఎకరం విస్తీర్ణానికి ఒక సభ్యుడి చొప్పున, ఇతర చెరువులు, కుంటలకు రెండు ఎకరాల విస్తీర్ణానికి ఒక సభ్యుడి చొప్పున సభ్యులు ఉండాలి. ఈ మేరకు 2,500 నుంచి 3వేల మేరకు సభ్యుల సంఖ్య పెంచి మత్స్య సొసైటీలను ఏర్పాటు చేయాల్సి ఉంది.

చెరువులు, సభ్యత్వాల పంచాయితీ

చెరువుల్లో ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలు సరఫరా చేయడంతో మత్స్యకారులకు ఊరట కలుగుతోంది. చేపల అమ్మకంతో మత్స్యకారులకు ఆదాయం వస్తోంది. ఇలా వచ్చే ఆదాయంపై అందరి దృష్టి పడింది. ఇప్పటి వరకు ఒక చెరువుపై రెండు, మూడు గ్రామాల మత్స్యకారులకు హక్కులు ఉండి వచ్చే ఆదాయాన్ని పంచుకునేవారు. గిరిజన ప్రాంతాల్లోని చెరువుల్లో కూడా గిరిజనేతరులు చేపపిల్లలు పోయడం, పట్టుకునే హక్కు ఉండేది. కానీ మారిన పరిస్థితులతో మా ఊరు చెరువులు మాకే ఇవ్వాలని గ్రామాల మధ్య, గిరిజన, గిరిజనేతరుల మధ్య పంచాయితీలు మొదలయ్యాయి.

ప్రభుత్వ నిబంధనల మేరకే..



జిల్లాలోని పలుచోట్ల చెరువుల వివాదాలు జరుగుతున్న విషయం వాస్తవమే. అయితే ఉన్నతాధికారుల ఆదేశాలు, ప్రభుత్వ నిబంధనల మేరకే సభ్యత్వాలు ఇస్తాం. చెరువులను కేటాయిస్తాం. నూతన సంఘాల ఏర్పాటు, సభ్యత్వాలు, చెరువుల కేటాయింపు మొదలైన అంశాలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. చెరువుల విస్తీర్ణం, చెరువులు ఉన్న ప్రాంతాలు, వృత్తి నైపుణ్య శిక్షణ మొదలైన అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నాం.

– నాగవాణి, జిల్లా మత్స్యశాఖ అధికారి

వేడుకలకు ఏర్పాట్లు పూర్తి



వేడుకలకు ముస్తాబైన కలెక్టరేట్

నేడు కలెక్టరేట్‌లో తొలిసారిగా గణతంత్ర వేడుకలు

- వీఐపీల కోసం ప్రత్యేక గ్యాలరీలు
- జెండా గద్దెతో పాటు టెంట్ల ఏర్పాటు



వీఐపీ గ్యాలరీ

మహబూబాబాద్: జిల్లా కేంద్రం శివారు కురవిరోడ్డులోని నూనత కలెక్టరేట్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలిసారిగా గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సర్వంసిద్ధం చేశారు. వీఐపీల కోసం ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు.

తొలిసారిగా..

ఇటీవల సీఎం కేసీఆర్ చేతుల మీదుగా నూతన కలెక్టరేట్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ కార్యాలయంతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలను నూతన కలెక్టరేట్‌లోకి మార్చారు. కాగా మొదటిసారిగా గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహిస్తుండడంతో భారీగా ఏర్పాట్లు చేశారు. జెండా గద్దె, టెంట్లు, వీఐపీలు, విలేకరుల కోసం ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే విద్యార్థులు, జిల్లా అధికారుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు.

కలెక్టర్ పతాకావిష్కరణ..

వేడుకల్లో భాగంగా శాఖలవారీగా ఉత్తమ సేవలందించిన అధికారుల జాబితా తయారు చేశారు. వారికి ప్రశంసపత్రాలు అందజేయనున్నారు. కాగా గురువారం ఉదయం 8.55గంటలకు పోలీసుల నుంచి కలెక్టర్ శశాంక గౌరవ వందనం స్వీకరిస్తారు. 9గంటలకు జాతీయ పతాకాన్ని కలెక్టర్ ఆవిష్కరిస్తారని అధికారులు తెలిపారు. 9.10గంటలకు సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని, 9.30 గంటలకు ప్రశంసపత్రాలు అందజేస్తారని చెప్పారు. కాగా వేడుకలకు హాజరుకావాలని ప్రజాప్రతినిధులకు అధికారులు ఆహ్వాన పత్రాలు అందజేశారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం డివిజన్ కేంద్రంలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మంత్రి దయాకర్‌రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓటు వేయడం ప్రాథమిక విధి అని, నూరుశాతం ఓటింగ్ జరిగినప్పుడే ప్రజాస్వామ్యం పరిరక్షించబడుతుందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, పాలకులను ఎన్నుకోవడానికి ఓటు కీలకమన్నారు. ఓటు ప్రజల భవితను కాపాడే వజ్రాయుధమన్నారు. అనంతరం పట్టణంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన కంఠమహేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. కంఠ మహేశ్వరస్వామి కృపతోనే తాను ఎన్నికల్లో గెలుస్తున్నానన్నారు. గౌడ సామాజికవర్గం తనకు అన్ని విధాలా అండగా నిలిచిందని గుర్తు చేశారు. పర్వతగిరిలో ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే పురాతన శివాలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, గ్రామీణాభివృద్ధి కమిషన్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, ఆర్డీఓ రమేష్, డాక్టర్ పొనుగోటి సోమేశ్వర్‌రావు, గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్‌గౌడ్, గౌడ సంఘ నాయకులు చీకటి రమేష్, జలగం స్వామి, రామ్మూర్తి పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం

- కలెక్టర్ శశాంక



వృద్ధ ఓటర్లను సన్మానిస్తున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని కలెక్టర్ శశాంక అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ(ఐడీఓసీ) సమావేశ మందిరంలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సొంత పనులను సైతం పక్కనపెట్టి ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఓటు హక్కు దేశ భవిష్యత్‌ను నిర్దేశిస్తుందన్నారు. అనంతరం 18సంవత్సరాలు నిండిన వారికి ఓటరు ఐడీ కార్డులు అందించారు. ఓటు హక్కు వినియోగించుకుంటున్న 80 సంవత్సరాలు దాటిన వృద్ధులను శాలువాలతో సన్మానించారు. ఉత్తమ బీఎల్‌ఓలకు ప్రశంసపత్రాలు అందజేశారు. వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఓటర్లతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీఓ కొమురయ్య, నోడల్ అధికారి సూర్యనారాయణ, తహసీల్దార్ నాగభవాని, యువ ఓటర్లు, వృద్ధ ఓటర్లు పాల్గొన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి

దంతాలపల్లి: పాఠశాలల్లో మనఊరు–మనబడి అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ శశాంక హెచ్చరించారు. బుధవారం మండలంలోని రేపోని గ్రామ పాఠశాలలో చేపడుతున్న మన ఊరు–మనబడి అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వారం రోజుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలని, వందశాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజ్, తహసీల్దార్ శివాని, ఎంపీడీఓ విజయలక్ష్మి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైద్యులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం సందర్శన..

మండల కేంద్రంలోని ఆస్పత్రితో పాటు రేపోని గ్రామంలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాలను బుధవారం కలెక్టర్ శశాంక సందర్శించారు. కంటి పరీక్షలపై ఆరా తీశారు. సిబ్బంది పనితీరుపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రాజెక్టులకు నిధులొచ్చేనా..!?

గత బడ్జెట్‌లో కేటాయించినా.. అరకొరగానే విడుదల..

- ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులు, నిధుల అవసరంపై ఆరా
- బడ్జెట్ ఎస్టిమేషన్‌లు సమర్పించిన ఇరిగేషన్ అధికారులు
- దేవాదుల, కాళేశ్వరం, ఎస్సారెస్పీ–2 తదితరాలకు ప్రతిపాదన
- సుమారు రూ.2,580 కోట్లు అవసరమని అంచనాలు?
- 2023–24 బడ్జెట్‌పైన ఆశలు.. నిధులు పారితేనే ప్రాజెక్టులు పూర్తి..



సాక్షిప్రతినిధి, వరంగల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమాల్లో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కీలకమైంది. అందులో ఉమ్మడి వరంగల్ మేడిగడ్డ కేంద్రంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చింది. జేసీఆర్ దేవాదుల, పీవీ కంతనపల్లి ప్రాజెక్టులు ప్రాధాన్యతగా తీసుకున్నవే. ఎస్సారెస్పీ స్టేజ్–2తో పాటు చిన్ననీటి వనరుల కోసం గతేడాది బడ్జెట్‌లో కేటాయించినా.. ఆ మేరకు విడుదల కాలేదు. ఎన్నికల ఏడాది కావడంతో వచ్చే నెల అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ సాగునీటి ప్రాజెక్టులకు నిధుల పారుదలపై ఆశలు రేకెత్తుతున్నాయి.

నిధులు పారితేనే పూర్తయ్యేది...

ఉమ్మడి వరంగల్‌లోని సాగునీటి ప్రాజెక్టులకు గడిచిన మూడేళ్లలో నిధులు ఆశించిన స్థాయిలో రాలేదు. జిల్లా జలవనరులశాఖ అధికారులు ఏటా పెద్ద ఎత్తున నిధుల కోసం ప్రతిపాదనలు పంపిస్తున్నా 35 శాతం కూడా కేటాయించడం లేదు. దీంతో ప్రాజెక్టు పెండింగ్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో కాళేశ్వరం, జేసీఆర్ దేవాదుల, పీవీఆర్ కంతనపల్లి, ఎస్సారెస్పీ–2లతో పాటు మిగిలిన ప్రాజెక్టుల పరిధిలో సుమారు 7.98 లక్షల ఎకరాలకు సాగునీరందుతుంది. పెండింగ్ పనులు పూర్తయితే 9.97 లక్షల ఎకరాలకు సాగునీరు పారుతుందని అధికారుల అంచనా. 2004లో రూ.6,084 కోట్లున్న దేవాదుల అంచనా వ్యయం 2020 జూన్ నాటికే రూ.14,945 కోట్లకు పైగా పెరిగింది. ఐదేళ్లలో పూర్తి కావాల్సి ప్రాజెక్టు 19 ఏళ్లవుతున్నా పూర్తి కావడం లేదు. గతేడాది రూ.2,506.24 కోట్లు బడ్జెట్‌లో కేటాయించినా 25 శాతం కూడా విడుదల చేయలేదు. కాళేశ్వరం మూడో టీఎంసీ, కంతనపల్లి, సమ్మక్క సాగర్ ప్రాజెక్టులది ఇదే పరిస్థితి.

రుణాలతో నెట్టుకొస్తున్నా..

ఎన్నో ఏళ్లుగా నిర్మాణంలో ఉన్న కొత్తగా చేపట్టిన ఐదు ప్రాజెక్టులను సకాలంలో పూర్తిచేసేందుకు తెలంగాణ జలవనరుల అభివృద్ధి కార్పొరేషన్ ద్వారా రుణాలు తీసుకోవడానికి ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. ఇందులో ఉమ్మడి జిల్లాకు చెందిన శ్రీరామసాగర్ వరద కాలువ, దేవాదుల, సమ్మక్క బ్యారేజీలు కూడా ఉన్నాయి. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర రూరల్ ఎలక్ట్రికల్ కార్పొరేషన్(ఆర్ఐసీ), పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ)ల నుంచి ఈ ఐదు ప్రాజెక్టులకు రూ.19,842.53 కోట్ల రుణం ఇచ్చేలా ఒప్పందం జరిగింది. రూ.14,253 కోట్లు బ్యాంకులు ఇచ్చాయి. మరో రూ.5,388 కోట్లు విడుదల దశలో ఆగిపోయాయి. దీంతో ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు నిధుల కొరత ఏర్పడింది.

ఈసారి భారీగా ప్రతిపాదనలు..

అదనపు ఆయకట్టుకు సాగునీరు అందాలంటే ఇప్పటికే కొనసాగుతున్న ప్రాజెక్టు పరిధిలోని ప్రధాన కాల్వలు, తూములు, పిల్ల కాల్వలు, వంతెనలు, పాత కాల్వలు మరమ్మతులు చేయాలి. మూడో టీఎంసీ, దేవాదుల, ఎస్సారెస్పీ–2 భూసేకరణ, పరిహారం వంటి సమస్యలను పరిష్కరించాలి. దీనికి నిధులు భారీగానే అవసరం. 2023–24 బడ్జెట్‌లో ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులకు ఏ మేర అవసరమో అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఉమ్మడి జిల్లాలోని ఆన్ గోయింగ్ ప్రాజెక్టులకు సుమారు రూ.2,580 కోట్లు అవసరం ఉంటాయని ప్రతిపాదించినట్లు సమాచారం.

మూడేళ్లలో సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయింపులు (రూ. కోట్లలో)

ప్రాజెక్టు	2020–21	2021–22	2022–23
కాళేశ్వరం ప్రాజెక్టు	805.478	918.00	2,506.24
జేసీఆర్ దేవాదుల	77.47	84.09	339.98
పీవీఆర్ కంతనపల్లి	73.83	21.02	42.51
ఎస్సారెస్పీ–2	61.40	11.00	20.00
పాకాల సరస్సు	0.41	6.02	7.50
రామప్ప	0.81	1.50	7.50
లక్నవరం	0.41	0.70	0.75
మల్లూరువాగు	0.31	0.45	2.00

దేవాదుల కాల్వల పూర్తికి ఇంకెన్నాళ్లు



దేవాదుల ప్రాజెక్టు కింద కొన్ని ప్రాజెక్టులు, ట్యాంకులు పూర్తి చేయాల్సి ఉంది. జనగామ జిల్లాలో భూసేకరణతో పాటు మెయిన్ కెనాల్స్, ఫీల్డ్ ఛానెల్స్ పూర్తి చేయడానికి డబ్బులు లేకపోవడమే కారణం. తాత్కాలికంగా చెరువులు నింపి చేతులు దులుపుకుంటున్నారు. కాలువల కింద పంటలు సాగైనప్పుడే ప్రభుత్వం ఆశించిన మేర లక్ష్యం నెరవేరుతుంది. వెంటనే భూ సేకరణకు, కాల్వల నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో సరిపడా నిధులు కేటాయించాలి.

– సీహెచ్.రాజారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, జనగామ

కరువు ప్రాంతాల్లోనే పెండింగ్ పనులు



ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కరువు ప్రాంతాలైన జనగామ, పాలకుర్తి, స్టేషన్ ఘన్‌పూర్, చుట్టుపక్కల నియోజకవర్గాలలో నిధులు లేక పనులు నిలిచిపోయాయి. సాగునీటితో సస్యశ్యామలం కావాలంటే ఏకైక మార్గం దేవాదుల పూర్తిస్థాయిలో నిర్మాణం చేయడం. కానీ ప్రతిసారి బడ్జెట్‌లో సరైన కేటాయింపు లేకపోవడం వల్ల గడిచిన 19 సంవత్సరాల నుంచి దేవాదుల ప్రాజెక్టు నీరు అందని ద్రాక్షగానే ఉండి పోయింది.

– బేజాటి బీరప్ప, చార్టర్డ్ అకౌంటెంట్

ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉన్నాయి



చాలా ప్రాజెక్టులు నిధుల కొరతతో అసంపూర్తిగా ఉన్నాయి. దేవాదుల గౌరవెల్లి ప్రాజెక్టులను పూర్తిగా చేసి ఎగువ ప్రాంత రైతాంగాన్ని ఆదుకునేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. పేదలకు ఇళ్ల స్థలాలు, ప్రభుత్వం ఇళ్లు కట్టించేందుకు లబ్ధిదారులకు ఐదు లక్షల రూపాయలు బడ్జెట్‌లో కేటాయించాలి. వరంగల్ మహానగరంలో ఉపాధి అవకాశాల కోసం పరిశ్రమలను నెలకొల్పేందుకు నిధులు ఇవ్వాలి.

– కర్రె భిక్షపతి, జిల్లా కార్యదర్శి, సీపీఐ, హనుమకొండ

నిరుపేదలకు 'కంటి వెలుగు' వరం

మరిపెడ రూరల్: కంటి వెలుగు కార్యక్రమం నిరుపేదలకు వరమని అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మరిపెడ మండలం ఎడ్జెర్ల గ్రామంలోని కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం ఆమె సందర్శించి ఏర్పాట్లును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పక్కా ప్రణాళికతో శిబిరాలను విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కేలోతు ధన్‌సింగ్, ఎంపీపీ గుగులోతు అరుణ,జెడ్పీటీసీ తేజావత్ శారద, వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు, స్థానికులు పాల్గొన్నారు.

తొర్రూరులో..

తొర్రూరు: కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. తొర్రూరు సబ్ సెంటర్‌లో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం ఆమె సందర్శించి మాట్లాడారు. అనంతరం ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, ఇన్‌చార్జ్ కమిషనర్ కుమార్ ఉన్నారు.

డీజీపీ నేర సమీక్ష సమావేశం

మహబూబాబాద్ రూరల్: డీజీపీ అంజనీకుమార్ హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మానుకోట జిల్లా పోలీస్ అధికారులతో బుధవారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. క్రైం రివ్యూ మీటింగ్‌లో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీలు సదయ్య, రఘు, రమణ, డీపీఓ అధికారులు జయరాం, మహమూద్, సీఐలు రవిరాజ్, బాలాజీ వరప్రసాద్, ఆర్ఐలు నర్సయ్య, లాల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' శిబిరాల సందర్శన

డోర్నకల్: డోర్నకల్‌తో పాటు చిలుకోడు, తహసీల్‌దారు బంజరలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఉమాగౌరీ బుధవారం సందర్శించారు. ఆయా గ్రామాల్లోని కంటివెలుగు శిబిరాలను పరిశీలించి ఆమె మాట్లాడారు. ఎక్కువ వయసు ఉండి కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి కళ్లద్దాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిబ్బంది పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వేణుమాధవరావు, సీహెచ్‌ఓ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



గిరిజన తండాలో దారుణం

- రెండేళ్ల చిన్నారిపై కామాంధుడి అత్యాచారయత్నం
- స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేసిన గ్రామస్తులు

గార్ల: రెండేళ్ల చిన్నారిని ఊయలలో పడుకోబెట్టి తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగా అదే తండాకు చెందిన 25 ఏళ్ల కామాంధుడు చిన్నారిపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. గ్రామస్తులు అతన్ని విద్యుత్‌ స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన జిల్లాలోని గార్ల మండలం కొత్తతండా గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కొత్తతండాకు చెందిన సపావట్‌ అశోక్‌కు ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. అతడికి పిల్లలు కలగకపోవడంతో మూడేళ్ల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. నాటి నుంచి అతను ఒంటరిగా ఉంటూ కూలీనాలి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నాడు. అదే తండాకు చెందిన ఓ దంపతులు తమ రెండేళ్ల కూతురును ఇంట్లో ఊయలలో పడుకోబెట్టి వ్యవసాయ పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని భావించి కామాంధుడు అశోక్‌ ఊయలలో పడుకున్న చిన్నారి నోరు మూసి అత్యాచారం చేయబోయాడు. చిన్నారి ఏడుస్తుండటంతో ఇరుగు పొరుగు వారు వచ్చి కామంధుడిని పట్టుకొని విద్యుత్‌ స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై బానోత్‌ వెంకన్న సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుడు అశోక్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు అశోక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఐసీడీఎస్‌ సీడీపీఓ ఎల్లమ్మ సందర్శించారు.


కామాంధుడిని స్తంభానికి కట్టేసిన గ్రామస్తులు

ఆర్ట్స్‌ కళాశాల డిగ్రీ సెమిస్టర్ల ఫలితాలు విడుదల

కేయూ క్యాంపస్‌: హనుమకొండలోని ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాల(అటానమస్‌) డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల 3వ, 5వ సెమిస్టర్‌ పరీక్షల ఫలితాల్ని కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, ప్రిన్సిపాల్‌ బన్న అయిలయ్య కళాశాలలో బుధవారం విడుదల చేశారు. ఈనెల 13న పరీక్షలు పూర్తికాగా.. కేవలం 12 రోజుల్లోనే ఫలితాలు విడుదల చేశారు. 3వ సెమిస్టర్‌లో 49.90శాతం, 5వ సెమిస్టర్‌లో 73.42శాతం ఉత్తీర్ణత నమోదైంది. రీవాల్యుయేషన్‌ కోసం ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రూ.275లు చెల్లించి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ హనుమంతు, కళాశాల పరీక్షల నియంత్రణాధికారి రాజు, గిరిప్రసాద్‌, కిష్టయ్య, విభాగాల అధిపతులు అంజన్‌రావు, చిర్ర రాజు, సురేశ్‌, రాజశేఖర్‌, రమేశ్‌, ప్రసాద్‌, పరహాఫాతిమా, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

పచ్చని సిరి.. పర్వతగిరి

- కనువిందు చేస్తున్న ప్రకృతి అందాలు
- నేటి నుంచి శివాలయ పునఃప్రతిష్ఠ

పర్వతగిరి: ఓవైపు ఆధ్యాత్మికం.. మరో వైపు ఆహ్లాదం. ఇంకోవైపు పర్యాటకం. ఇలా పచ్చని సిరిగల పర్వతగిరి భక్తులను, ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది. వరంగల్‌ జిల్లా కేంద్రానికి 33 కిలోమీటర్ల దూరంలో ఉన్న పర్వతగిరి ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. ఇక్కడి పెద్ద చెరువు రిజర్వాయర్‌ సుమారు 500 ఎకరాల విస్తీర్ణానికి సాగు నీరందిస్తోంది. రిజర్వాయర్‌కు ఆనుకుని ఇరువైపులా పంచగుట్టలున్నాయి. అందులో చెన్నకేశవ గుట్ట (ప్రస్తుతం పర్వతాల గుట్ట) ఆగుట్టపై శివాలయం విరాజిల్లుతోంది. చెరువులో టూరిజం శాఖ రెండు బోట్లను ఏర్పాటు చేసింది. గుడికి ఇరువైపులా పచ్చని పంట పొలాలు చూపుతిప్పుకోనివ్వవు. అక్కడే కొలువైన పెద్దమ్మ, గంగమ్మ, మైసమ్మతల్లులు భక్తులకు దీవెనలందిస్తున్నాయి. త్వరలో కంఠమహేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించనున్నారు. కల్లెడలో కొలను వెంకటేశ్వస్వామి ఆలయం అక్కడే సుమారు వంద సంవత్సరాల క్రితం నిర్మించిన కల్లెడ గడీ. ఇవన్నీ పర్యాటకులను రారమ్మని ఆహ్వానిస్తున్నాయి.

నేటి నుంచి ఆలయ పునఃప్రతిష్ఠ

పర్వతగిరి శివాలయ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలు గురువారం ఉదయం 5 గంటల నుంచి ప్రారంభం కానున్నాయి. రోజంతా వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా.. సాయంత్రం 6గంటలకు అనంత లక్ష్మమ్మ, 6.30 నుంచి 10గంటల వరకు రజని సిస్టర్స్‌తో గాన కచేరి నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 5గంటలకు మేలు కొలుపు నుంచి మొదలుకొని సాయంత్రం 6గంటల వరకు పూజా కార్యక్రమాలుంటాయి. రెండో రోజు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం 6గంటల నుంచి 9గంటల వరకు మధుప్రియ గానామృతం ఉంటుంది. 28న ముఖ్య అతిథులుగా ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు, శ్రీశివక్షేత్రం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శివస్వామి పాల్గొంటారు. సాయంత్రం 6.30 గంటలకు సినీ గాయకురాలు సునీత పాటల కార్యక్రమం ఉంటుంది. కాగా.. ఈమూడ్రోజులు ఉదయం 11గంటల నుంచి 4గంటల వరకు 400 మంది విద్యార్థులతో వందేమాతరం, క్లాప్స్‌తో శివ నామస్మరణ (ప్రతీ రెండు గంటలకు ఒకసారి) నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు లక్ష మంది వరకు భక్తులు వచ్చే అవకాశం ఉంది. 200 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ తదితరులు రానున్నారు.

అధిక సంఖ్యలో భక్తులు రావాలి..

పర్వతాల శివాలయం పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఈమేరకు శివాలయాన్ని బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ.. పర్వతగిరి చుట్టు పక్కల గ్రామాల ప్రజలంతా పాల్గొని శివుడి ఆశీస్సులు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో శివాలయ పునఃప్రతిష్ఠ కారకుడు ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు, జెడ్పీటీసీ సింగ్‌లాల్‌, గ్రామసర్పంచ్‌ చింతపట్ల మాలతిసోమేశ్వర్‌రావు, ఉపసర్పంచ్‌ రంగు జనార్దన్‌గౌడ్‌, జెడ్పీ కో–ఆప్షన్‌ సభ్యుడు సర్వర్‌, రైతు సమితి మండల కో–ఆర్డినేటర్‌ చిన్నపాక శ్రీనివాస్‌, పీఏసీఎస్‌ చైర్మన్లు గొర్రె దేవేందర్‌, మోటపోతుల మనోజ్‌గౌడ్‌, మామునూరు ఏసీపీ నరేశ్‌కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.


పర్వతాల శివాలయం


జలకళను సంతరించుకున్న పర్వతగిరి పెద్ద చెరువు రిజర్వాయర్‌


చెరువులో ఏర్పాటు చేసిన బోటింగ్‌

‘సదరం’ పేరిట నకిలీ వైద్యుల దోపిడీ

- రిపోర్టర్‌నని ఓ వ్యక్తి ఆరా తీయడంతో పరార్‌

గూడూరు: ‘మీ గ్రామంలోనే సదరం క్యాంపులు నిర్వహిస్తున్నాం. వెంటనే సర్టిఫికెట్లు ఇస్తాం’ అని ఓ ఇద్దరు నకిలీ వైద్యులు డబ్బులు దండుకుని పరారయ్యారు. బుధవారం మహబూబాబాద్‌ జిల్లా గూడూరు మండలం పొనుగోడు, రాములుతండా, చిర్రకుంట తండాల్లో ఈఘటన జరిగింది. ఉమ్మడి వరంగల్‌ జిల్లా దుగ్గొండి మండలం గిర్నిబావికి చెందిన ఎండి.దస్తగిరితో పాటు మరొకరు డాక్టర్‌గా గుర్తింపు కార్డులు మెడలో వేసుకొని మంగళవారం చిర్రకుంట తండాకు వచ్చారు. తండాలో వృద్ధులు, వికలాంగులను ఒక చోట చేర్చి సదరం క్యాంపు, సర్టిఫికెట్ల ఉపయోగం గురించి అవగాహన కల్పించారు. మీ ఊరిలోనే క్యాంపు నిర్వహిస్తామని, ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.8 వేలు అవుతుందని, ముందుగా రూ.3 నుంచి రూ.5 వందలు ఇవ్వాలనడంతో నమ్మిన కొందరు గ్రామస్తులు డబ్బులిచ్చారు. పొనుగోడులో క్యాంపు నిర్వహిస్తామని, డబ్బులిచ్చిన వ్యక్తులు పొనుగోడుకు రావాలని వెళ్లిపోయారు. బుధవారం పొనుగోడు చేరుకున్న ఆ ఇద్దరు వ్యక్తులు సర్పంచ్‌ నలమాస వెంకన్న, పంచాయతీ కార్యదర్శికి తమ ఐడీ కార్డులు, పత్రాలు చూపి ఊళ్లో డప్పు చాటింపు చేయించారు. ఈసమాచారం విన్న గ్రామానికి చెందిన ఓవ్యక్తి మండల కేంద్రంలోని ఐకేపీ ఏపీఎం రవీందర్‌కు సమాచారం అందించాడు. గ్రామాల్లో సదరం క్యాంపు పెట్టడమేంటి, తనకు సమాచారం లేకుండా జరుగుతుందా? జిల్లా అధికారులను తెలుసుకుంటానని చెప్పి ఏపీఎం ఆలస్యం చేశాడు. యూట్యూబ్‌ చానల్‌ రిపోర్టర్‌నని ఓ వ్యక్తి నకిలీ వైద్యుడి మెడలోని ట్యాగ్‌ను ఫొటో తీసేందుకు యత్నించాడు. దీంతో వారికి భయమేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఆతర్వాత వారు నకిలీ వైద్యులని ఏపీఎం రవీందర్‌ చెప్పారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించి గ్రామంలోని వీధుల్లో వారి కోసం గాలిస్తుండగా.. మరో వీధి నుంచి నకిలీ వైద్యులు నర్సంపేట మార్గం వైపు పారిపోయారు.

నీ వల్లే డబ్బులు పోయాయి!

‘నీ వల్లే డబ్బులు పోయాయి. సర్టిఫికెట్‌ రాలేదు. నువ్‌ రాకపోతే వాళ్లు సర్టిఫికెట్లు ఇచ్చే వాళ్లు’ అంటూ నకిలీ వైద్యులకు డబ్బులు చెల్లించిన కొందరు గ్రామస్తులు రిపోర్టర్‌ అని చెప్పి ఐడీ కార్డు ఫొటో తీసిన వ్యక్తితో గొడవకు దిగినట్లు సమాచారం. పోలీసులు వచ్చి మీరంతా నకిలీ వైద్యుల చేతిలో మోసపోయారని చెప్పడంతో గ్రామస్తులు ఖంగుతిన్నారు. చిర్రకుంటతండా, రాములుతండా, పొనుగోడు గ్రామాల్లో మొత్తం రూ. 50 వేల వరకు డబ్బులు దండుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై సర్పంచ్‌, పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా.. ఐడీ కార్డులు చూపెట్టడంతో అర్హులకు పింఛన్‌లు వస్తాయనుకుని నమ్మినట్లు తెలిపారు.


నకిలీ వైద్యుడి గుర్తింపు కార్డు

ఘనంగా శుద్ధి పండుగ

- మేడారం, కన్నెపల్లిలో ప్రత్యేక పూజలు

ఎస్‌ఎస్‌ తాడ్వాయి: మేడారంలో సమ్మక్క, కన్నెపల్లిలోని సారలమ్మ గుడి శుద్ధి పండుగ పూజా కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సమ్మక్క పూజారులు ఉదయాన్నే తల స్నానాలు ఆచరించి అమ్మవారి గుడికి వెళ్లి శుద్ధి చేశారు. అనంతరం సమ్మక్క పూజారి సిద్ధబోయిన మునీందర్‌ ఇంటి నుంచి పూజారి కొక్కెర కృష్ణయ్య, దూపవడ్డ నాగేశ్వర్‌రావు దూపం పట్టుకొని డోలు వాయిద్యాలతో పూజారులు సమ్మక్క గుడికి చేరుకున్నారు. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. గుడిలో ఆడపడుచులు అమ్మవారి శక్తి పీఠం గద్దెను ముగ్గులతో అలంకరించారు. గుమ్మాల వద్ద ముగ్గులు వేశారు. అనంతరం పూజారులు దూప దీపాలు వెలిగించి, యాటను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆదివాసీల సంప్రదాయం ప్రకారం అడవి నుంచి కొత్తగా తీసుకువచ్చిన ఎట్టిగడ్డిని సమ్మక్క గుడి ఈశాన్య మూలకు ఉంచారు.

కన్నెపల్లిలో..

కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో కూడా సారలమ్మ ప్రధాన పూజారి కాక సారయ్యతో పాటు పూజారులు గుడిని శుద్ధి చేసి సారలమ్మ వడ్డెరలను పసుపు, కుంకుమలు పెట్టి అలంకరించారు. దీపాలు వెలిగించి పూజలు చేశారు. అమ్మవారి గుడి ఆవరణలో ముగ్గులు వేసి అలంకరించారు. ఈకార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు సిద్దబోయిన మహేశ్‌, లక్ష్మణ్‌రావు, బొజారావు, జనార్దన్‌, దశరథం తదితరులు పాల్గొన్నారు.


డోలు వాయిద్యాలతో సమ్మక్క గుడికి వస్తున్న పూజారులు

ఇద్దరికి ఇండియన్‌ పోలీస్‌ మెడల్‌

- వరంగల్‌ సీపీగా పనిచేసిన తరుణ్‌జోషి, టీఎస్‌ఎస్పీ ఆర్‌ఐ దయాశీల ఎంపిక
- పనిలో నిబద్ధత, సేవకు తగిన గుర్తింపు

వరంగల్‌క్రైం/మామునూరు: పోలీస్‌శాఖలో విశిష్టమైన సేవలు అందించినందుకుగాను ఉమ్మడి వరంగల్‌ జిల్లాలో ఇద్దరు అధికారులకు ఇండియన్‌ పోలీస్‌ మెడల్‌(ఐపీఎం) దక్కింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్రం ఈ అవార్డులను ప్రకటించింది. అందులో ఒకరు ఇటీవల బదిలీ అయిన వరంగల్‌ పోలీస్‌ కమిషనర్‌ డాక్టర్‌ పి.తరుణ్‌జోషికాగా, మరొకరు మామునూరు టీఎస్‌ఎస్పీ నాలుగో బెటాలియన్‌ ఆర్‌ఐ కారుకొండ దయాశీల.

గంజాయి రహిత కమిషనరేట్‌గా..

వరంగల్‌ పోలీస్‌ కమిషనర్‌గా పనిచేసిన డాక్టర్‌ తరుణ్‌జోషికి కేంద్ర ప్రభుత్వం పోలీస్‌ మెడల్‌ ప్రకటించింది. 2021 ఏప్రిల్‌ 7 నుంచి 2022 డిసెంబర్‌ 2 వరకు సీపీగా పనిచేసిన డాక్టర్‌ తరుణ్‌జోషి వరంగల్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో మత్తు పదార్థాల నివారణకు కృషి చేశారు. ముఖ్యంగా వివిధ రాష్ట్రాలనుంచి కమిషనరేట్‌ మీదుగా రవాణా అవుతున్న గంజాయిని అరికట్టడంతోపాటు భారీ ఎత్తున పీడీ యాక్ట్‌ కేసులు నమోదు చేశారు. మత్తు పదార్థాలకు బానిసలైన యువతను సన్మార్గంలో పెట్టడానికి న యా కిరణ్‌ పేరుతో రిహాబిలిటేషన్‌ సెంటర్‌ను ఏర్పాటు చేసి విముక్తి కల్పించారు. అన్ని పోలీస్‌ స్టేషన్ల పరిధిలో మత్తు పదార్థాలు, ట్రాఫిక్‌ నిబంధనలు, సైబర్‌ క్రైం నేరాలు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ‘వరంగల్‌లో చేసిన కార్యక్రమాలకు ఐపీఎం అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉంది’అని తరుణ్‌జోషి ‘సాక్షి’కి తెలిపారు. కమిషనరేట్‌ పోలీస్‌ అధికారులు, సిబ్బంది సహకారంతోనే ఇది సాధ్యమైందని ఆనందం వ్యక్తం చేశారు.

టీఎస్‌ఎస్పీ ఆర్‌ఐ దయాశీలకు..

ఖిలా వరంగల్‌ మండలం మామునూరు టీఎస్‌ఎ స్పీ నాలుగో బెటాలియన్‌లో ఆర్‌ఐగా విధులు నిర్వహిస్తున్న కారుకొండ దయాశీలకు మంచి పేరుంది. క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న ఆర్‌ఐ దయాశీలకు కేంద్ర హోంశాఖ గుర్తించి ఐపీఎం అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అవార్డును త్వరలోనే డైరెక్టర్‌ ఆఫ్‌ జనరల్‌ చేతులమీదుగా అందుకోనున్నారు. రిపబ్లిడే సందర్భంగా తనకు ఇండియన్‌ పోలీస్‌ మెడల్‌ అవార్డు దక్కడం ఎంతో ఆనందంగా ఉందని దయాశీల తెలిపారు. శివప్రసాద్‌రెడ్డితోపాటు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.


తరుణ్‌జోషి..


దయాశీల

చికిత్స పొందుతూ జీవిత ఖైదీ మృతి

ఎంజీఎం: వరంగల్‌ ఎంజీఎంలో చికిత్స పొందుతున్న కరీంనగర్‌ జిల్లా ధర్మపురికి చెందిన జీవిత ఖైదీ గడ్డం శ్రీను బుధవారం మృతి చెందినట్లు ఎంజీఎం వైద్యులు తెలిపారు. 2007 జూలైలో అదనపు సెషన్‌ జడ్జి యావజ్జీవ కారాగార శిక్ష విధించడంతో అతడు జైలుశిక్ష అనుభవిస్తున్నాడు. ఈక్రమంలో ఈనెల 24న అనారోగ్య కారణాలతో అతడిని ఎంజీఎం ఆస్పత్రికి చికిత్స కోసం తీసుకొచ్చారు. కాగా.. చికిత్స పొందుతూ బుధవారం శ్రీను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

అదుపుతప్పి డీసీఎం బోల్తా

- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

నర్సంపేట రూరల్‌: వరంగల్‌ నుంచి నర్సంపేటకు లోడుతో వెళ్తున్న డీసీఎం పట్టణ శివారులోని బ్రిడ్జి సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈఘటనలో డీసీఎం డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో నెలన్నర శిశువు మృతి

ఖానాపురం: మండలంలోని కొత్తూరులో బుధవారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో నెలన్నర శిశువు మృతి చెందింది. నెక్కొండ మండలం దీక్షకుంట్ల గ్రామానికి చెందిన అంకేశ్వరపు రామకృష్ణ, రచన దంపతులకు ఇటీవల ఆడశిశువు జన్మించింది. ఈక్రమంలో రచన కొత్తూరులోని అమ్మమ్మ ఇంటి వద్దకు వచ్చి ఉంది. కాగా..45 రోజుల పాపకు గ్రామంలో హెల్త్‌ సబ్‌సెంటర్‌కు తీసుకెళ్లి నెల ఇంజెక్షన్‌లు వేయించారు. సుమారు గంటకు పైగా సెంటర్‌లోనే ఉన్నారు. ఆతర్వాత శిశువును ఇంటికి తీసుకెళ్లిన తర్వాత అస్వస్థతకు గురయ్యింది. కుటుంబ సభ్యులు గమనించి నర్సంపేటలోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా.. వైద్య పరీక్షలు చేయగా.. శిశువు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని తల్లిదండ్రులు రచన–రామకృష్ణ తెలిపారు. కాగా.. ఇంజెక్షన్‌లు వికటించడం వల్లే శిశువు మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈవిషయంపై పీహెచ్‌సీ వైద్యులు భూపేశ్‌ను వివరణ కోరగా.. ఇంజెక్షన్‌లు వికటించి ఉండకపోవచ్చని, ఘటనపై పూర్తి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. కాగా.. శిశువు కుటుంబాన్ని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, సర్పంచ్‌ భూస రమఅశోక్‌యాదవ్‌ పరామర్శించారు.


శిశువు మృతదేహం

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్‌

వెంకటాపురం(కె): మండల పరిధి నూగూరు గ్రామ సమీపంలో గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం పోలీసులు అరెస్ట్‌ చేశారు. గ్రామ సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా.. వెంగళరావుపేట గ్రామానికి చెందిన సాధనపల్లి మౌళి, ఆలుబాక గ్రామానికి చెందిన బసరికారి కమల్‌ అనుమానాస్పదంగా పోలీసులకు కనిపించారు. వారిని తనిఖీ చేయగా.. గంజాయి లభ్యమైంది. చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌ జిల్లా నుంచి గంజాయి తీసుకొస్తూ పట్టుబడినట్లు వారు ఒప్పుకున్నారు. వారి వద్ద ఉన్న 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు వెంకటాపురం ఎస్సై అశోక్‌ తెలిపారు.


తనిఖీలు చేస్తున్న పోలీసులు

రోడ్లపై డబ్బుల వసూలు

డోర్నకల్‌: స్థానిక మెయిన్‌ రోడ్డుతో పాటు ఇతర ప్రాంతాల్లో బుధవారం కొంతమంది యువతులు, మహిళలు బైక్‌లను అడ్డగించి డబ్బులు వసూలు చేశారు. రాజస్థాన్‌కు చెందిన కొంత మంది యువతులు, మహిళలు కుటుంబాలతో కలిసి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. తర్వాత మహిళలు, యువతులు గుంపులుగా విడిపోయి పలు వీధుల్లో తిరుగుతూ రోడ్లపై ద్విచక్ర వాహనదారులను అడ్డగించి డబ్బులు వసూలు చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు రైల్వే స్టేషన్‌ ఆవరణకు చేరుకోగా.. మహిళలు, యువతుల కుటుంబ సభ్యులతో కలిసి రైల్లో వెళ్లిపోయారు.


ద్విచక్ర వాహనదారుడిని డబ్బులడుగుతున్న మహిళ